APTEL/2008/28200

## తెలంగాణ పదో తరగతి ఫలితాలు విడుదల

హైదరాబాద్ : తెలంగాణ పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు బషీర్‌బాగ్‌లోని ఎస్సీఈఆర్టీ కార్యాలయంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం పది ఫలితాలను విడుదల చేశారు. టెన్త్ ఫలితాల్లో 91.31 ఉత్తీర్ణత శాతం నమోదైంది. బాలికలు 93.23 శాతం ఉత్తీర్ణత, బాలురు 89.42 శాతం ఉత్తీర్ణత సాధించారు. 3,927 స్కూళ్లలో 100 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఆరు స్కూళ్లలో జీరో ఉత్తీర్ణత శాతం నమోదైంది. గతేడాది 89.60 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈ ఏడాది 91.31 శాతానికి పెరిగింది. మొత్తం 5,05,813 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 4,91,862 మంది విద్యార్థులు పాస్ అయ్యారు.




# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం


## రైతులపైన కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత ఉంది

ఖమ్మం : కూసుమంచి మండలం కేంద్రం లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో కార్యకర్త మీటింగ్ జరిగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ పదేళ్ల పాలన చేసిన మాజీ ముఖ్యమంత్రి నోటికొచ్చిన అబద్ధాలు మాట్లాడుతున్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ళు, ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి ఒక్క హామీని కూడా అమలు చేయని ఆయన ఈరోజు మాట్లాడుతున్నాడు. కాంగ్రెస్ అధికారంలో రాగానే ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రెండు వందల ఉచిత విద్యుత్,ఆరోగ్య శ్రీ, 500 కె గ్యాస్ పథకాలు అమలు చేసాం. రైతులపైన కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత ఉంది. మేము వచ్చిన మూడు నెలల్లోనే రైతులకు ఇన్సూరెన్స్ చేయించాం. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల మెస్ బిల్లులు కట్టకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం కట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కు మొదటి తారీకునే జీతాలు ఇస్తున్నాం. సిగ్గులేకుండా కరెంటు పోతుందని మాజీ ముఖ్యమంత్రి తన స్థాయిని మర్చిపోయి అబద్ధాలు మాట్లాడుతున్నాడని అన్నారు.

సంపుటి: 16 సంచిక : 04 కరీంనగర్ బుధవారం, మే 01, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు

# గతంలో కేసీఆర్ నాపై కేసు పెడితే కారు షెడ్డుకు పోయింది, ఇప్పుడు..- సీఎం రేవంత్ రెడ్డి



జమ్మికుంట : కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో కాంగ్రెస్ జన జాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీ, కేసీఆర్ టార్గెట్ గా నిప్పులు చెరిగారు. లోక్ సభ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని, చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు రేవంత్ రెడ్డి. "కరీంనగర్ చైతన్యవంతమైన జిల్లా. ఎమ్మెస్సార్, చొక్కారావు లాంటి ఎందరో ఉద్ధండులు ఈ జిల్లా నుంచి గెలిచారు. తెలంగాణ ఆకాంక్ష కోసం ఆనాడు మీరంతా కేసీఆర్ ను మూడు సార్లు గెలిపించారు. అదే కేసీఆర్ మా పాలమూరు గడ్డ మీదకు పోటీ కోసం వస్తే మేము కూడా గెలిపించాం. అదే కేసీఆర్ ను మీరు మొన్న ఓడించి బుద్ధి చెప్పారు. సెమీఫైనల్లో కేసీఆర్ ను ఓడించిన మీరు.. ఫైనల్లో బీజేపీని ఓడించి సూరత్ కు పంపించాలి. తెలంగాణకు మోదీ ఇచ్చిందేమీ లేదు. బండి సంజయ్ కరీంనగర్ కు తెచ్చిందేమీ లేదు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సహా ఏ విభజన హామీని బీజేపీ నెరవేర్చలేదు. తెలంగాణ ఏర్పాటును అవమానించేలా మోదీ మాట్లాడారు. తలుపులు మూసి తెలంగాణ ఇచ్చారని, తల్లిని చంపి బిడ్డను బతికించారని మోదీ అవహేళన చేశారు. తెలంగాణను అవమానించేలా మోదీ మాట్లాడితే బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదు? తెలంగాణకు గాడిద గుడ్డు కూడా ఇవ్వలేదు. అందుకే బండికి ఓటేయాలా? ఆనాడు అరగుండు బండిని, పూర్తి గుండు అర్వింద్ ను ఓడించారు. అయోధ్యలో రాముని కల్యాణం జరగక ముందే అక్షింతలు ఇంటికి పంపించడమంటే సంప్రదాయాలను మంట గలిపి రామున్ని అవమానించారు. మనందరం రాముని భక్తులం కాదా.. మనం పండుగలు చేసుకోవడం లేదా? గ్రామ దేవతలకు కల్లు కోడి కొయ్యలేదా? హిందుత్వాన్ని ఓట్ల కోసం, వ్యాపారానికి వాడుకుంటున్నారు. దేవుని బొమ్మ చూపించి ఓట్లడుక్కునే నీచ రాజకీయాలు చేస్తున్నారు. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ లాంటి మహనీయుల నుంచి మేము దేశభక్తిని పునికి పుచ్చుకున్నాం. బీసీల రిజర్వేషన్ పెంచాలని, బీసీ జనగణన చేయాలని రాహుల్ చెప్పారు. దానికి అనుగుణంగా రాష్ట్రంలో చర్యలు చేపట్టాం. మీరు రిజర్వేషన్లు రద్దు చేయాలనుకుంటున్నారని నేను ఆరోపిస్తున్నా. అందులో భాగంగానే 400 సీట్లు కావాలంటున్నారు. 2/3 మెజార్టీ వస్తే.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తారు. బీజేపీ బీసీ లెక్కలు వద్దంటోంది. ఎందుకు రిజర్వేషన్లు రద్దు చేయాలనుకుంటున్నారో మోదీ ఇక్కడికొచ్చి చెప్పాలి. బీజేపీ ఓడితేనే రిజర్వేషన్లు కొనసాగుతాయి. మనం గెలవాలంటే బీజేపీ ఓడాలి.

# బీఆర్ఎస్-కాంగ్రెస్ రెండూ ఒక గూటి పక్షులే: ప్రధాని మోదీ

## తెలంగాణలో డబుల్ ఆర్ ట్యాక్స్: రాజ్యాంగంపై మోడీ సంచలన వ్యాఖ్యలు

జహీరాబాద్: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జహీరాబాద్‌లో బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మోడీ పాల్గొని ప్రసంగించారు. తెలుగు సినిమా ఇండస్ట్రీ ట్రిపుల్ ఆర్ లాంటి సూపర్ హిట్ సినిమా ఇస్తే.. తెలంగాణకు కాంగ్రెస్ డబుల్ ఆర్ ట్యాక్ ఇచ్చిందని ఎద్దేవా చేశారు. డబుల్ ఆర్ ఎవరో మీకు అర్థమయ్యే ఉంటుంది. తెలంగాణలో కాంగ్రెస్ డబుల్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తోంది. వ్యాపారవేత్తలు డబుల్ ఆర్ ట్యాక్స్ కట్టాల్సి వస్తోంది. డబుల్ ట్యాక్సుతో ప్రజలు విసిగిపోయారు. డబుల్ ఆర్ ట్యాక్సు సొమ్ము ఢిల్లీకి వెళుతోంది. డబుల్ ఆర్ ట్యాక్సుకు షాక్ ఇవ్వకపోతే రాబోయే రోజుల్లో మరింత పతనమవుతుంది. ఈ డబుల్ ఆర్ ట్యాక్సుపై విస్తృత చర్చ నడుస్తోందని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. రఘురామ కృష్ణం రాజుకు మరో షాక్..గెలుపు ఆశలపై నీళ్లు..? లోక్సభ ఎన్నికలు 2024 నియోజకవర్గాలు ఎ అభ్యర్థులు ఎ ఎన్నికల తేదీలు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకే గూటి పక్షులని మోడీ విమర్శించారు. ప్రజలు భవిష్యత్ కోసం దాచిన సొమ్మును దోచేసే కుట్ర చేస్తోందని కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు. కేంద్రంలో కాంగ్రెస్ వస్తే ప్రజల సొమ్ముకు రక్షణ ఉండదని అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే వారసత్వ పన్ను విధించబోతోందన్నారు. ప్రజల ఆస్తుల్లో 50 శాతం లూటీ చేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందన్నారు ప్రధాని మోడీ. అవినీతి రాకెట్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు భాగస్వాములని ప్రధాని మోడీ దుయ్యబట్టారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుతో భారీ కుంభకోణానికి పాల్పడిందన్నారు. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి పాత్ర ఉన్నప్పటికీ బీఆర్ఎస్ తొక్కిపెట్టిందని.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం స్కాంను తొక్కిపెడుతోందని విమర్శించారు. ఢిల్లీ లిక్కర్ కేసులో బీఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతి దోస్తీ బయటపడిందని విమర్శించారు. నేను బ్రతికున్నంత వరకు రాజ్యాంగాన్ని కాపాడతా. మోడీ కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం అంటే ఎప్పుడూ గౌరవం లేదని



మండిపడ్డారు ప్రధాని మోడీ. మొదటి రోజు నుంచీ రాజ్యాంగం, అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించిందని ధ్వజమెత్తారు. మొదట రాజ్యాంగంలో రామాయణ, మహాభారత చిత్రాలు ఉండేవని.. వాటిని కాంగ్రెస్ తొలగించిందని గుర్తు చేశారు. అలీకి జగన్ మరో షాక్ అధికార దాహంతో నెహ్రూ, ఇందిర రాజ్యాంగాన్ని పదే పదే అవమానించారని మండిపడ్డారు. ఎమర్జెన్సీని విధించి ప్రజల హక్కులను కాలరాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని పేద ప్రజల కోసం కాంగ్రెస్ ఎప్పుడూ పనిచేయలేదన్నారు. లంబాడి సమాజానికి కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను ముస్లింలకు కట్టబెట్టాలని కుట్ర చేస్తోందని మోడీ అన్నారు. నరేంద్ర మోడీ బ్రతికున్నంత వరకు రాజ్యాంగం రద్దు కాదని, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత తనదేనని ప్రధాని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన రిజర్వేషన్లను కాపాడతామని అన్నారు. ముస్లింలకు మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇచ్చే ప్రయత్నాన్ని అడ్డుకుంటానని స్పష్టం చేశారు. ఫేక్ వీడియోలపై ప్రధాని మోడీ ఆగ్రహం మరోవైపు, రిజర్వేషన్లపై తమ నేతలపై ఫేక్ వీడియోలు చేసి బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు ప్రధాని మోడీ. ఇదంతా డబుల్ ఆర్ పనేనంటూ పరోక్షంగా రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఫేక్ వీడియోలు చేసినవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# కాంగ్రెస్ మునిగిపోతున్న నౌక, ఏ శక్తీ కాపాడలేదు



ఖాండ్వా: కాంగ్రెస్‌ను 'మునిగిపోతున్న నౌక'తో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పోల్చారు. నౌకకు అడుగున చిల్లు పడిందని, అది మునిగిపోకుండా ప్రపంచంలోని ఏ శక్తీ కాపాడలేదని జోస్యం చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా, బద్వానీ జిల్లాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గాంధీ కుటుంబంపై రాజ్‌నాథ్ సింగ్ విమర్శలు గుప్పిస్తూ, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ప్రజాస్వామ్యం ఏర్పడినందున కాంగ్రెస్‌ను రద్దు చేయాలని మహాత్మాగాంధీ చెప్పారని, అయితే ఆయన అభ్యర్థనను కాంగ్రెస్ పెడచెవిన పెట్టిందని అన్నారు. మహాత్మాగాంధీ ఏదైతే చెప్పారో దానిని పరిపూర్ణం చేసేందుకు దేశ ప్రజలు ఇప్పుడు స్థిరనిశ్చయంతో ఉన్నారని, కచ్చితంగా దేశంలో కాంగ్రెస్ అనేది లేకుండా చేస్తారని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ వంటి నేతలంతా పేదరికాన్ని నిర్మూలిస్తామని చెప్పిన వాళ్లేనని, అయితే ఆ పని చేయడంలో వాళు విఫలమయ్యారని రాజ్‌నాథ్ అన్నారు. మోదీ ప్రభుత్వం పదేళ్లలో సమర్థవంతంగా 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చారని తెలిపారు. సూరత్, ఇండోర్ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిదంటూ విపక్షం ఆరోపిస్తోందని, కాంగ్రెస్ అభ్యర్థులు గతంలో ఏకక్రీగవంగా 20 సార్లు గెలిచారని గుర్తుచేశారు. సూరత్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవంగా గెలిచారని, ఇండోర్ కాంగ్రెస్ అభ్యర్థి పార్టీకి రాజీనామా చేసి బీజేపీకి మద్దతిచ్చారని తెలిపారు. బీజేపీ పట్ల ప్రజలకున్న ప్రేమ అటువంటిదని చెప్పారు. కాంగ్రెస్ మాత్రం బీజేపీతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అటోందని, గతంలో కాంగ్రెస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా 20 సార్లు నెగ్గినప్పుడు ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందా? అని రాజ్‌నాథ్ ప్రశ్నించారు. కాగా, మధ్యప్రదేశ్‌లో నాలుగు విడతలుగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. మొదటి రెండు దశలు ఏప్రిల్ 19, 26 తేదీల్లో జరిగాయి. మధ్యప్రదేశ్‌లో 29 లోక్‌సభ స్థానాలు ఉండగా, 2019లో బీజేపీ 28 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక సీటు దక్కించుకుంది.

## కాంగ్రెస్ కాదు స్కాంగ్రెస్.. ఆ పార్టీ అవినీతి దేశమంతా తెలుసు : కేసీఆర్

కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు జాతీయ వార్తా సంస్థ ఏఎన్ఐ మంగళవారం మాట్లాడారు. బస్‌యాత్రలో యాత్ర లో భాగంగా కొత్తగూడెంకు బయలు దేరిన సమయంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఇంత వరకు అమలు చేయలేదన్నారు. రైతుబంధుపై కాంగ్రెస్ సర్కారు మాట తప్పిందని విమర్శించారు. ఇంత వరకు రైతుబంధు ఇవ్వలేదని.. కాంగ్రెస్ సర్కారుపై అన్నదాతలు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలపై తమ పోరాటం కొనసాగుతుందన్నారు. దేశంలో రైతులు కష్టాల్లో ఉన్నారన్నారు. కాంగ్రెస్ అవినీతి గురించి దేశం మొత్తం తెలుసని.. కాంగ్రెస్ కాదు.. స్కాంగ్రెస్ పార్టీ అంటూ విమర్శించారు. దేశంలో పాంతీయ పార్టీల బలం పెరుగుతుందన్నారు. కేంద్ర సర్కారు ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలదే ముఖ్యపాత్ర అని స్పష్టం చేశారు. ఇండియా కూటమి ఎక్కడుందని ప్రశ్నించారు. ఎన్డీయేకు 200కి మించి సీట్లు రావని.. కేంద్ర విచారణ సంస్థలు బీజేపీ జేబు సంస్థలుగా మారిపోయాయని విమర్శించారు. మోదీ హయంలో సంపద విదేశాలకు తరలిపోతుందని చెప్పారు. రాజకీయ లాభం కోసమే లిక్కర్ స్కాం పేరుతో పార్టీలను వేధిస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ మోదీ కల్పితమని.. దేశంలోని న్యాయవ్యవస్థపై మాకు నమ్మకం ఉందని తెలిపారు. రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు.

# దొంగ వీడియోలతో బీజేపీ ప్రతిష్ట దెబ్బతీసే కుట్ర జరుగుతోంది- బండి సంజయ్



వేములవాడ : దొంగ వీడియోలతో బీజేపీ ప్రతిష్ట దెబ్బతీసే కుట్ర జరుగుతోందని బండి సంజయ్ ఆరోపించారు. ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్ నీచానికి దిగజారుతోందన్నారు. వేములవాడలో బండి సంజయ్ మాట్లాడారు. 6 గ్యారెంటీలపై కాంగ్రెస్ బండారాన్ని ప్రజలు గమనించారని, ఎన్నికల్లో ఆ పార్టీ నేతలను ప్రజలు నిలదీస్తున్నారని చెప్పారు. అందుకే 6 గ్యారెంటీలపై అడిగితే మాట్లాడలేనని సీఎం రేవంత్ అంటున్నారని బండి సంజయ్ అన్నారు. "కరీంనగర్ లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా తెలియదు. రైతులు, నిరుద్యోగులు సహా ప్రజలు అల్లాడుతుంటే కనీసం స్పందించని నేత వినోద్ కుమార్. నాపై పోటీ చేస్తే డిపాజిట్లు కూడా రాని పొన్నం ప్రభాకర్ నా గురించి అవాకులు పేలుతుండటం సిగ్గుచేటు. పొన్నం వ్యవహార శైలిని చూసి కాంగ్రెస్ నేతలే బెంబేలెత్తుతున్నారు. సమాజంలో అనేక బాధలు ఎదుర్కొంటున్నది మాదిగలే. ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతో మంది మాదిగలు బలిదానమయ్యారు. మాదిగ సమాజంపై అవాకులు పేలుతున్న మానకొండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి. ఎస్సీలను కించపరుస్తున్న నేతలను ఎక్కడికక్కడ అడ్డుకోండి. పేదలు, దళిత, గిరిజన, బీసీ, అగ్రవర్ణాల పేదల గురించి అవాకులు పేలితే సహించేది లేదు. ఈ నెల 8న వేములవాడకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వస్తున్నారు. వేములవాడలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి" అని పిలుపునిచ్చారు బండి సంజయ్.

# పన్నూన్ హత్యకు కుట్ర.. ఆ మీడియా రిపోర్ట్‌కి భారత్ స్ట్రాంగ్ కౌంటర్



న్యూఢిల్లీ: ఖలిస్తానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ హత్యకు కుట్రలో భారత మాజీ ఇంటెలిజెన్స్ అధికారి హస్తం ఉందని వాషింగ్టన్ పోస్ట్ ప్రచురించిన కథనాన్ని భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఆ కథనం పూర్తిగా అసమంజసమైనది, నిరాధారమైందని తిప్పికొట్టింది. దీనిపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ.. ఆ మీడియా కథనం పూర్తిగా నిరాధారమైందన్నారు. క్రిమినల్, ఉగ్రవాద నెట్‌వర్క్‌లకు సంబంధించి అమెరికా లేవనెత్తిన భద్రతా సమస్యలను పరిష్కరించేందుకు.. భారత ప్రభుత్వం ఓ ఉన్నతస్థాయి కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసిందని, అది సమగ్ర విచారణ జరుపుతోందని చెప్పారు. కానీ.. ఇంతలోనే ఊహాగానాలు, బాధ్యతరహితమైన వ్యాఖ్యలు చేయటం సరికాదని.. ఇలాంటి వ్యాఖ్యల వల్ల ఒరిగేదేమీ లేదని తేల్చి చెప్పారు. కాగా.. వాషింగ్టన్ పోస్ట్ ప్రచురించిన ఆ కథనంలో.. విక్రమ్ యాదవ్ అనే భారత 'రా' మాజీ అధికారి పన్నూన్‌ని అమెరికాలో చంపేందుకు ప్రణాళికలు రచించారని, ఇందుకు ఓ బృందాన్ని కూడా ఏర్పాటు చేశాడని పేర్కొంది. అయితే.. ఈ హత్యాయత్నాన్ని అమెరికా నిఘా విభాగాలు అడ్డుకున్నాయని తెలిపింది. 'రా' ఉన్నతాధికారుల అనుమతితోనే విక్రమ్ ఆ పనికి సిద్ధమయ్యాడని, కాబట్టి ఈ హత్యాయత్నంలో వారి ప్రమేయం కూడా ఉంటుందని అమెరికా నిఘా వర్గాలు భావిస్తున్నట్లు ఆ పత్రిక రాసుకొచ్చింది. ఈ కుట్ర గురించి ప్రధాని మోదీకి అత్యంత సన్నిహితమైన అంతర్గత బృందానికి కూడా తెలుసని, ఇందుకు ఆధారాలు కూడా అమెరికా సంస్థలు గుర్తించాయని చెప్పింది. విదేశాల్లోని తమ శత్రువులను నిర్మూలించేందుకు కొన్ని దేశాల ప్రభుత్వాలు వివిధ చర్యలకు పాల్పడుతున్నాయని, వాటిపై పరిశోధనల క్రమంలోనే పన్నూన్ హత్యాయత్నం వివరాల్ని, ఆధారాల్ని సేకరించే యత్నం జరిగిందని వాషింగ్టన్ పోస్ట్ నివేదించింది. ఇందుకు కౌంటర్‌గానే రణ్‌ధీర్ జైస్వాల్ పైవిధంగా స్పందించారు

# సీఎం రేవంత్ రెడ్డి అరెస్టుకు బీజేపీ కుట్ర: సీపీఐ నారాయణ



హైదరాబాద్ : కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫేక్ వీడియో కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఢిల్లీ పోలీసులు సమన్లు జారీ చేయడంపై సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకోవాలన్నదే బీజేపీ లక్ష్యమని, ఆయనను అరెస్ట్ చేయాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "రేవంత్ రెడ్డిని మే 1న విచారణకు రావాలని నోటీసుల్లో ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. అంటే ఎన్నికల ప్రచారం ఆపేయించి మానసికంగా దెబ్బతీయాలన్నది బీజేపీ లక్ష్యం. ఒకవేళ సీఎం రేవంత్ రెడ్డిని అరెస్టు చేస్తే మోదీ పతనం ప్రారంభమైనట్లే. ఇప్పటికే ఢిల్లీ, జార?ండ్ సీఎంలను అరెస్టు చేసి జైలుకు పంపారు. సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టారన్న సాకుతో కేసుల్లో ఇరికించడం సరికాదు. ప్రధాని మోదీ, అమిత్ షా ప్రసంగాలు రాజ్యాంగ వ్యతిరేకంగా ఉంటున్నాయ"ని అన్నారు. కేంద్రం బీజేపీ గెలిస్తే సంకీర్ణ ప్రభుత్వం వస్తుందని కేసీఆర్ కలలు కంటున్నారని.. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే కేంద్ర మంత్రులు అవుతారని ఆయన చెబుతున్నారని నారాయణ తెలిపారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కూడా కాలేదు.. కాంగ్రెస్ సర్కారు పడిపోయి తమ ప్రభుత్వం వస్తుందని కేసీఆర్ ప్రచారం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రుణమాఫీపై పొలిటికల్ డ్రామా నడుస్తోందని, ఎవరూ రాజీనామా చేయరని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమ మిత్ర పక్షమైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిచేందుకు సీపీఐ పార్టీ కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని కోరారు.

# మల్కాజ్ గిరి పార్లమెంట్ పరిధిలోని పార్టీ యూత్ లీడర్లు, సోషల్ మీడియా సమావేశమైన ప్రసంగించిన భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మల్కాజ్గిరి ఏప్రిల్ 30 తెలంగాణ నుండి ఫోకస్ : మల్కాజ్ గిరి పార్లమెంట్ పరిధిలోని పార్టీ యూత్ లీడర్లు, సోషల్ మీడియా సమావేశమైన ప్రసంగించిన భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. మాట్లాడుతూ బీఆర్ఎస్ కు ఎందుకు ఓట్లు వేయాలని కొందర అడుగుతున్నారు. 2001 లో కేసీఆర్ పార్టీ పెట్టి మీరు పార్లమెంట్ సీట్లు ఇవ్వండి నేను తెలంగాణ తెస్తానని చెప్పారు. అప్పుడు వైఎస్, చంద్రబాబు లాంటి నాయకులు వెటకారంగా మాట్లాడారు. 2004 లో ఐదుగురు ఎంపీలతో తెలంగాణ కోసం కొట్లాడి వాళ్లే తెలంగాణ తెచ్చారు. ముఖ్యంగా హైదరాబాద్ కు డేంజర్ ఉంది. 2014 లో కూడా హైదరాబాద్ ను యూటీ చేయాలని ప్రయత్నం చేశారు. ఉమ్మడి రాజధానికి ఉన్న పదేళ్ల సమయం పూర్తికాగానే హైదరాబాద్ ను కేంద్రపాలిత ప్రాంతం చేస్తారు. హైదరాబాద్ ను యూటీ చేయొద్దంటే గులాబీ జెండా కచ్చితంగా లోక్ సభలో ఉండాలె. కాంగ్రెస్, బీజేపీ నాయకులకు దీన్ని అడ్డుకునే శక్తి, సత్తా లేదు. హైదరాబాద్ పై పెత్తనం, కేసీఆర్ కు ఈ ప్రాంతం మీద పట్టు లేకుండా చేసేందుకు కూడా ఈ ప్రయత్నం చేస్తారు. కంటోన్మెంట్ లో ఇంచు భూమి కోసం మనల్ని చావగొట్టారు. సందు దొరికితే కచ్చితంగా హైదరాబాద్ ను తమ ఆధీనంలోకి తీసుకుంటారు. బీజేపీ గెలిస్తే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రిజర్వేషన్లను ఎత్తివేస్తారు. బీజేపీ వాళ్లే డైరెక్ట్ గా ఈ విషయాన్ని చెబుతున్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్ర కూడా చేస్తున్నారు. బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నారు. కర్ణాటక, తమిళనాడు లో ఓట్ల కోసం గోదావరి నది నుంచి నీళ్లు ఇచ్చే కుట్ర చేస్తున్నారు. నదుల అనుసంధానం పేరుతో తెలంగాణ అవసరాలు తీరకుండానే నీటి మళ్లించే దగా చేస్తున్నారు. 2026 లో జరిగే డిలిమిటేషన్ ను జనాభా ప్రతిపాదికగా చేసి సౌతిండియా అన్యాయం చేసే కుట్ర చేస్తున్నారు. వీటన్నింటిని అడ్డుకొని గల్లా పట్టి నిలదీయాలంటే కచ్చితంగా లోక్ సభలో గులాబీ కండువా ఉండాలె. పదేళ్లలో బీఆర్ఎస్ ఎంపీలు 4754 ప్రశ్నలు అడిగారు. కాంగ్రెస్, బీజేపీ లు అసలు రాష్ట్రం కోసం ప్రశ్నలు అడగాలె. బీజేపీకి నలుగురు ఎంపీలు ఉన్నారు. ఒక్కడు కూడా ఈ ప్రాంతానికి మేలు చేసే విధంగా ప్రశ్నించలే. తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ తెలంగాణ మీద విషం చిమ్మిన మోడీని ప్రశ్నించే దమ్ము లేదు. మల్కాజ్ గిరి ఎంపీగా రేవంత్ రెడ్డి ఒక్క రూపాయి పని కూడా చేయలే.

# రాబోయే తరం భవిష్యత్తును, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఈ ఎన్నికలు : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 30 : తెలంగాణ నుండి ఫోకస్ రేగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ జనజాతర సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ వేదిక పై ముందుగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా.కడియం కావ్య మాట్లాడుతూ రాబోయే తరం భవిష్యత్తును, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఈ ఎన్నికలు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుంది. దేశవ్యాప్తంగా సమాజంలోని అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా కాంగ్రెస్ పార్టీ ఐదు హామీలను ప్రకటించింది. 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలకు శాశ్వత నియామకాలు. ప్రతీ పేద కుటుంబంలో ఒక పేద మహిళకు ఏటా రూ.లక్ష రూపాయలను అందించనుంది. కేంద్ర ప్రభుత్వ నియామకాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు. అంగన్ వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలకు కేంద్ర ప్రభుత్వ వాటా రెట్టింపు అందిచనుంది. పంటలకు అందించే కనీస మద్దతు ధరకు చట్టపరమైన హోదా ఇవ్వబడుతుంది. రైతులు, యువకులు మరియు బడుగు బలహీన వర్గాలకు అన్యాయం చేసింది బీజేపీ. బడా పెట్టుబడిదారులు, ధనవంతుల కోసం బిజెపి పనిచేస్తుంది. నరరూప రాక్షసుడిలా మోడీ దేశంలో మత విద్వేషాలు రెచ్చ గొట్టి రాజకీయ పబ్బం గడుపుతున్నారు.

# సెలవులు ముగిసేలోగా మరమ్మతు పనులు పూర్తి చేయాలి

## వట్టెంల, ఫాజుల్ నగర్లో పాఠశాలలను పరిశీలించిన కలెక్టర్ అనురాగ్ జయంతి



వేములవాడ, ఏప్రిల్ 30, 2024: వేసవి సెలవులు ముగిసేలోగా ఆయా పాఠశాలల్లో మౌలిక వసతుల మరమ్మతు పనులు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద వేములవాడ రూరల్ మండలం లోని వట్టెంల, ఫాజుల్ నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చేయనున్న మరమ్మతు పనుల ప్రణాళికను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి తో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయా స్కూల్ లలో తరగతి గదులు, మరుగు దొడ్లు, నీటి వసతి, విద్యుత్ సౌకర్యాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మ ఆదర్శ పాఠశాల కింద తరగతి గదులు, మరుగు దొడ్ల లో మరమ్మతు పనులు చేయించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తాగు నీటి వసతి కల్పించాలని ఆదేశించారు. తరగతి గదులలో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అవసరం మేరకు ఏర్పాటు చేయాలని వివరించారు. ఆయా పనులు త్వరగా మొదలు పెట్టి నాణ్యతా ప్రమాణాల ప్రకారం పూర్తి చేయించాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఇక్కడ జడ్పీ సీఈవో ఉమారాణి, డీఈఓ రమేష్ కుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థిని గెలిపించుకోవాలి : మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా

శంకర్ పల్లి మండల, మంగళవారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ బూత్ స్థాయి ఇన్చార్జిల సమావేశంలో చేవెళ్ల బీఆర్ ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ .. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా మాట్లాడుతూ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థులు గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు ఇంద్రారెడ్డి ,స్థానిక చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ ఎంపీపి గోవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీలు, తాజా మెజజీ సర్పంచ్లులతో కలిసి పాల్గొన్నారు.



మంగళవారం శంకర్ పల్లి మండల, మున్సిపాలిటీ బీఆర్ఎస్ బూత్ స్థాయి ఇన్చార్జిల సమావేశంలో చేవెళ్ల బీఆర్ ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గారు.. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గారు,స్థానిక చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య గారు, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ గారు, ఎంపీపి గోవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీలు, తాజా మెజజీ సర్పంచ్లులతో కలిసి పాల్గొన్నారు.

# హైదరాబాద్ బరిలో 30 మంది

హైదరాబాద్ : హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పై హైదరాబాద్ కలెక్టర్,రిటర్నింగ్ ఆఫీసర్ అనుదీప్ ప్రెస్ మీట్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ వ్యాప్తంగా 22 లక్షల 17 వేల 94 ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు -11 లక్షల 25 వేల 310. మహిళ ఓటర్లు -10 లక్షల 91 వేల 587 ఓటర్లు.ఇతరులు - 197 ఓటర్లు. 58 మంది నామినేషన్లు వేశారు. 19 స్క్రూటినీ సమయం లో రిజెక్ట్ చేశాం. 8 మంది ఇండిపెండెంట్ విత్ డ్రా చేసుకున్నారు..30 మంది బరిలో ఉన్నారు.ఇప్పటికే అందరికీ సింబల్ కేటాయించాం. బ్యాలట్ ప్రచురించాం. ఎలక్షన్ డ్యూటీ లో ఉన్న వారి అందరికీ పోస్టల్ బల్లట్ కల్పించాం. హోమ్ ఓటింగ్ కు 129 మంది కి కలిపించాం. 3 తేది నుండి హోం ఓటింగ్ ప్రారంభం అవుతుంది. 8 వేల మందికి పోస్టల్ బ్యాలెట్ కలిపిస్తున్నం. 5989 మంది ఇతర జిల్లాల వారు ఓటు వేసేందుకు ఓటు కలిపించాం. 3 నుండి 8 తేది వరకు పోస్టల్ బ్యాలెట్ వారు ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. 203 సెక్టార్ ఆఫీసర్ల ను నియమించాం.

# ఓల్డ్ బోయిన్ పల్లి, రైతు సమ్మేళనంలో పాల్గొన్న ఈటల రాజేందర్




అభ్యర్థి ఈటెల రాజేందర్ మేడ్చల్ ఏప్రిల్ 30, తెలంగాణ నుండి ఫోకస్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని బూటకపు హామీలు ఇచ్చిందో మీకు తెలుసు. చదువుకున్నవారు కానీ, వ్యాపారస్తులు కానీ వారిని నమ్మి ఓట్లు వేయరని వారికి అర్థమైంది. పేదవారిని ప్రలోభ పెట్టి, రైతులకు రుణ మాఫీలు చేస్తామని అబద్దపు హామీలు ఇచ్చి వారిచేత ఓట్లు వేయించుకుందామనుకుంటున్నారు. మరోసారి రైతులను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడే మాటలకు విలువ లేకుండా పోయింది. గత పదేళ్ల మోదీ గారి పాలనలో ప్రశాంతంగా ఉన్నామని, మరోమారు ఆయనకే ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలు ఆలోచిస్తున్నారు. ఇప్పుడు ఏ ఇంటికి పోయినా బీజేపీ కార్యకర్తలకు మిక్కిలి మర్యాదలు లభిస్తున్నాయి. పదేళ్ల క్రితం బీజేపీ తెలంగాణలో గెలుస్తుందని ప్రజలు నమ్మలేదు. కానీ ఇప్పుడు మోదీ పాలనపై అందరికీ విశ్వాసం ఏర్పడింది. బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు అసెంబ్లీ ఎన్నికలలోనే వ్యతిరేకంగా ఉన్నారు. అందుకే ఈ పార్టీకి ఓట్లు వచ్చే ప్రశ్నే లేదు. ఇక రేవంత్ రెడ్డి మహిళలకు ఎన్నో పథకాలు ప్రకటించారు. పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి పథకం కింద లక్ష రూపాయల నగదు, తులం బంగారం ఇస్తానని మభ్యపెట్టాడు. మహిళలకు 2,500 రూపాయల పెన్షన్, వృద్ధులకు కూడా కొత్త పెన్షన్లు ఇవ్వడం లేదు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రమాణ స్వీకారం చేయగానే పథకాలు అమలు చేస్తానని చెప్పాడు. కానీ ఇంకా ఏవీ నెరవేర్చలేదు. రాష్ట్రప్రభుత్వ వద్ద అప్పులే కానీ, పథకాల కోసం నిధులు లేవు. లంకెబిందెలు ఉన్నాయని వచ్చా, కానీ ఖాళీ ఖజానా కనిపిస్తోందని రేవంత్ రెడ్డి అంటున్నాడు. మద్యం షాపుల వల్ల వచ్చే ఆదాయం తప్ప తెలంగాణకు ఆదాయం వచ్చే మార్గం లేదు. పైగా రాహుల్ గాంధీ ప్రధాని అయితే హామీలన్నీ నెరవేర్చగలమని రేవంత్ రెడ్డి చెప్తున్నాడు. కేవలం 40 సీట్లున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఎలా వస్తుంది. దీనిని బట్టి రాష్ట్రప్రభుత్వం ఏ రకమైన హామీలను నెరవేర్చేది లేదని అర్థమవుతోంది . పేదలకు ఇళ్లు కట్టించే బాధ్యతను కేంద్రప్రభుత్వమే నేరుగా తీసుకుంటుందని ప్రధాని మోదీ ప్రకటించారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా ఐదు లక్షల రూపాయల వరకూ పేదలకు ఉచిత వైద్యం అందిస్తోంది కేంద్రప్రభుత్వం. అంతేకాక ఇన్సూరెన్స్లు కూడా అమలు చేసే బాధ్యతను తీసుకుంది. మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజక వర్గంలో బీజేపీ అభ్యర్థినైన నాకు ఇక్కడ సమస్యలను నేరుగా ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లగలిగే చొరవ ఉంది. ఈ నియోజక వర్గంలో గెలిస్తే మొత్తం 15 అసెంబ్లీ స్థానాలు గెలిచినట్లు లెక్క. దేశంలోనే పెద్ద లోక్‌సభ నియోజక వర్గమైన ఈ స్థానంలో మనం గెలిస్తే, రాష్ట్రంలో 15 అసెంబ్లీ స్థానాన్ని ప్రభావితం చేయవచ్చు. బీజేపీ పార్టీకి ఓట్లు వేసేలా ప్రజలను ప్రభావితం చేయవలసిందిగా, ఇంటిటికీ కరపత్రాలను పంచి, ప్రధాని మోదీ పథకాలను తెలియజేయవలసిందిగా అందరినీ కోరుతున్నాను.

# సకాలంలో పోస్టల్ బ్యాలెట్ పేపర్ ముద్రణ పూర్తి చేయాలి...

## పెద్దపల్లి పార్లమెంటు రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్



పెద్దపల్లి, ఏప్రిల్ -30: సకాలంలో పోస్టల్ బ్యాలెట్ పత్రాల ముద్రణ ప్రక్రియను పూర్తి చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ పోస్టల్ బ్యాలెట్ పత్రాలు ముద్రిస్తున్న ప్రింటింగ్ ప్రెస్ ను సందర్శించి, పోస్టల్ బ్యాలెట్ పత్రాల ముద్రణను పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, పెద్దపల్లి పార్లమెంటు స్థానానికి జరుగుతున్న ఎన్నికలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, హోం ఓటింగ్ వినియోగించుకుంటున్న ఓటర్లు, ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగించుకోనున్న అత్యవసర సేవల సిబ్బంది కోసం అవసరమైన మేర పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ముద్రించి వెంటనే అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సహాయ రిటర్నింగ్ అధికారులకు అందజేయడం జరుగు తుందని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాల ముద్రణ ప్రక్రియ ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా జరుగుతుందని, ఎన్నికల నియమావళి ప్రకారం నిబంధనలు పాటిస్తూ అక్షరమాల ప్రకారం బ్యాలెట్ పత్రంలో అభ్యర్థుల క్రమ సంఖ్య నిర్ణయించామని అన్నారు. ఈ పర్యటనలో రిటర్నింగ్ అధికారి వెంట తహసిల్దార్ కుమార స్వామి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సునితమ్మ ప్రచారంకు మేడ్చల్ ప్రజల బ్రహ్మరథం



మేడ్చల్: మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేంధర్ రెడ్డి ప్రచారానికి జనం బ్రహ్మరథం పడుతున్నారు. మంగళవారం మేడ్చల్ నియోజకవర్గంలోని మేడ్చల్ మున్సిపాలిటీ, డబిల్ పూర్, రావల్ కోల్, గుండ్లపోచంపల్లి గ్రామాల్లో నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ వజ్రేశ్ యాదవ్ ఆధ్వర్యంలో రోడ్డుషోలు, పాదయాత్రలు నిర్వహించారు. మండుటెండలోనూ రోడ్డు షోలకు మహిళలు భారీగా తరలివచ్చి సునితమ్మపై అభిమానాన్ని చాటారు. తాము సునితమ్మ అభయహస్తం కోసం ఆమె వెన్నంటే నడుస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్నర్ సమావేశాల్లో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ విజయానికేజ్ ఈ 10 రోజులు పనిచేస్తే తాను 5 ఏళ్ళు సేవకురాలిగా పనిచేస్తానని భరోసా ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. ప్రజా సమస్యలపై తనకు సంపూర్ణమైన అవగాహన ఉందని, రంగారెడ్డి జడ్పి చైర్ పర్సన్ గా ఈ ప్రాంతం అభివృద్ధికి కృషిచేస్తానని చెప్పారు. ఈ గ్రామంలో చూసిన అభివృద్ధి కి తాను వేసిన శిలాఫలకాలు సాక్షంగా కనిపిస్తున్నాయని అన్నారు. మీ ఇంటి ఆడపడచుగా తనను ఆదరించాలని కోరారు. ఎక్కడ వెళ్లిన మహిళలు తనకు హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. తన విజయం ఖరారు కావడంతో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటై కుట్రలు ఓడించడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అంతకు ముందు డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జీ వజ్రేశ్ యాదవ్ , మాజీ జడ్పిటీసీ నక్కా ప్రభాకర్ గౌడ్, శైలజ రెడ్డి, సీపీఐ మండల అధ్యక్షుడు శశిధర్ రెడ్డి మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గం నుంచి సునితమ్మకు భారీ మెజార్టీ ఇస్తామని అన్నారు. సునితమ్మ శిలాఫలకం లేని ఊరు లేదని అన్నారు. ఈ కార్యాలయంలో మాజీ జడ్పిటీసీ సిద్దాల శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# రోడ్ షో కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



వికారాబాద్ ఏప్రిల్ 30 తెలంగాణ నుండి ఫోకస్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని వికారాబాద్ నియోజకవర్గం మోమిన్ పేట్ మండలం కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా లో ఏర్పాటు చేసిన రోడ్ షో కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కలిసి పాల్గొనడం జరిగింది. అనంతరం ఏజీఆర్ గార్డెన్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కార్యకర్తను ఉద్దేశించి ఇరువురు ప్రసంగించడం జరిగింది. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికుడిలా ఇంటింట ప్రచారం చేస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.500 కోట్లు మంజూరయ్య అని ఆయన చెప్పారు. మహిళల సంక్షేమం కోసం పెద్ద పీట వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. ఆగస్టు 15వ తేదీ లోపు రైతులకు రూ.2 లక్షల రూపాయలు రుణమాఫీ, మిగిలిన అన్ని గ్యారెంటీలను హామీలను అమలు చేస్తామన్నారు. బిజెపి పార్టీకి ఓటు వేస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్ రద్దు చేస్తారని అన్నారు. బ్యాంకు ఖాతాలో 15 లక్షల రూపాయలు వేస్తానని చెప్పి దేశంలోని ప్రజలను మోసం చేసారు. రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎత్తున ఓట్లు వేసి నన్ను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.